
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 11 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08



# భూమి పొందే వరకు విశ్రమించొద్దు

## దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

### మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్



కుత్బుల్లాపూర్, అక్షిత ప్రతినిధి: బౌరంపేట్ దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దుండిగల్ గండి మైసమ్మ మండలం పరది బౌరంపేట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా, ఆయన స్థానిక దళితులు సర్వే నెంబర్ 472 ఎర్రమన్ను బొందల స్థలాన్ని సందర్శించారు. అక్కడే ..మిగతా 2లో




# పారదర్శకతకు డోర్స్ క్లోజ్!

ప్రజా పాలనలో పారదర్శకతకు పాతర!!

తలుపులు మూసి సర్వసభ సమావేశం.. ఇస్నాపూర్‌లో చర్చనీయాంశం...!!!

తలుపులు మూసి సర్వసభ సమావేశం

ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది?


ప్రజా సమస్యలపై చర్చించే సమావేశానికే తలుపులు బంద్.. అధికారుల తీరుపై విమర్శలు!

చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు హాజరు.. కానీ సమావేశం మాత్రం మూసిన తలుపుల మధ్యేనా?

లక్డారం వార్డు కార్యాలయ సర్వసభ సమావేశంపై చర్చ!

తలుపులు ఎందుకు మూసారు? సమావేశంలో ఏం చర్చించారు?

ఇస్నాపూర్ మున్సిపాలిటీ సమాధానం చెప్పాలంటున్న ప్రజలు!






పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి : ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లక్డారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ సమావేశం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొన్నారు. అయితే సమావేశం నిర్వహిస్తున్న సమయంలో వార్డు కార్యాలయ ..మిగతా 2లో

# అంతర్రాష్ట్ర ఆల్ప్రాజోలం సరఫరా నెట్‌వర్క్ ఛేదన...!

## డ్రగ్స్ డబ్బుతో కూడబెట్టిన రూ.3.02 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్....!

## నలుగురు అరెస్ట్...!



నిజామాబాద్, అక్షిత బ్యూరో: ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరా, విక్రయాలకు పాల్పడుతున్న ముఠాపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. డ్రగ్స్ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి ఏకంగా రూ. 3.02 కోట్ల విలువైన ఆస్తులపై జప్తు ..మిగతా 2లో

# పయనం... ప్రాణ సంకటం

## మూన్నాళ్ళ ముచ్చటగా గుంతలమయంగా రహదారి

## తాండూర్-హైదరాబాద్ రోడ్డుపై గుంతలే గుంతలు

## మూడు, నాలుగు నెలల్లోనే దెబ్బతిన్న రహదారి

## ప్రయాణికులకు తప్పని అవస్థలు





తాండూరు, అక్షిత ప్రతినిధి: పయనం... ప్రాణ సంకటంగా పరిణమించింది. అంతా గుంతలమయం. ఈ రహదారిపై పయనం ప్రయాణికులకు ఇబ్బందిని తలపిస్తుంది. తాండూర్--హైదరాబాద్ ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కందనెల్లి వాగు నుంచి మంబాపూర్ రైస్ మిల్ వరకు రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణం ..మిగతా 2లో

## పయనం... ప్రాణ సంకటం

**మొదటి పేజీ తరువాయి...**

పూర్తయిన మూడు, నాలుగు నెలల్లోనే పలు చోట్ల రోడ్డు దెబ్బతిని, గుంతలు ఏర్పడటంపై ప్రయాణికులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించేందుకు వాహనాలను ఒక వైపు నుంచి మరో వైపుకు మళ్లించాల్సి వస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారింది. గుంతల్లో వాహనాలు దిగడంతో అదుపుతప్పే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ తాండూర్, హైదరాబాద్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగి స్తుంటారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, ప్రయాణికులు నిత్యం ఈ మార్గంపైనే ఆధార పడుతున్నారు. అయితే రహదారి దుస్థితి కారణంగా ప్రయాణ సమయం పెరగ డంతో పాటు వాహనాలపై కూడా అదనపు భారం పడుతోందని, వాహన దారులు పేర్కొంటున్నారు. తాండూర్--హైదరాబాద్ మధ్య రాకపోకలకు ఎంతో కీలకమైన ఈ ప్రధాన రహదారిని నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి చేస్తే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి పూర్తిస్థాయిలో పునర్నిర్మించి, భవిష్యత్తులో త్వరగా దెబ్బతిన కుండా చర్యలు తీసుకోవాలని, కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, రహదారి పరిస్థితిని పరిశీలించి, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని,శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంతర్రాష్ట్ర ఆల్ప్రాజోలం సరఫరా నెట్‌వర్క్ ఛేదన...!

**మొదటి పేజీ తరువాయి...**

అటాచ్‌మెంట్ చర్యలు చేపట్టారు. రాజస్థాన్ నుంచి మహారాష్ట్ర మీదుగా నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు ఆల్ప్రాజోలం సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఏసీపీ బి. ప్రకాష్ పర్యవేక్షణలో నిజామాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. శ్రీనివాస్, ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో సాగిన దర్యాప్తులో ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది.

**నలుగురు అరెస్ట్.. భారీగా స్వాధీనం**

నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆల్ప్రాజోలం అక్రమ సరఫరాకు సంబంధించి ఐదుగురిపై క్రైమ్ నంబర్ 127/2025 కింద ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. నిందితుల నుంచి సుమారు 1.087 కిలోల ఆల్ప్రాజోలం, రెండు కార్లు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.3.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రాజస్థాన్ నుంచి నిజామాబాద్‌కు..**

దర్యాప్తులో నిందితులను విచారించడంతో ఆల్ప్రాజోలం సరఫరాకు సంబంధించిన కీలక వివరాలు బయటపడ్డాయి. రాజస్థాన్ నుంచి మహారాష్ట్ర మీదుగా చిన్న మొత్తాల్లో ఆల్ప్రాజోలం తీసుకొచ్చి నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కిలోకు సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయిస్తూ భారీగా అక్రమ నగదు సంపాదించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**డ్రగ్స్ డబ్బుతో ఆస్తుల కొనుగోలు**

డ్రగ్స్ అక్రమ వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బుతో నిందితులు వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, నివాస గృహాలు, వాహనాలు కొనుగోలు చేయడంతో పాటు బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వలు, డిపాజిట్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. గంధం శ్రీనివాస్ గౌడ్, ఆయన కుటుంబ సభ్యులు, ఏ2 బొట్ల కాటమయ్య గౌడ్‌కు సంబంధించిన ఆస్తులపై దర్యాప్తు చేపట్టారు. నిజామాబాద్, నిర్మల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వ విలువల ప్రకారం సుమారు రూ.3.02 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించగా.. బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ మరింత ఎక్కువగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68ఎఫ్(2) ప్రకారం సంబంధిత కాంపిటెంట్ అథారిటీ ద్వారా ఆస్తులపై జప్తు/అటాచ్‌మెంట్ చర్యలు చేపట్టారు.

# పారదర్శకతకు డోర్స్ క్లోజ్!

**మొదటి పేజీ తరువాయి...**

తలుపులు మూసి సమావేశం నిర్వహించడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలు, వార్డుల అభివృద్ధి, మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించే సర్వసభ సమావేశాల నిర్వహణలో పారదర్శకత ఉండాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించే సమావేశం కావడంతో తలుపులు మూసి సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సమావేశంలో ఏయే అంశాలపై చర్చించారు? ఏవైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారా? సమావేశానికి సంబంధించిన వివరాలను ప్రజలకు వెల్లడిస్తారా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.ప్రజా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఎంతో ముఖ్యమని, మున్సిపల్ సమావేశాల నిర్వహణపై ప్రజలకు స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

లక్దారం వార్డు కార్యాలయంలో సర్వసభ సమావేశం తలుపులు మూసి నిర్వహించడానికి గల కారణాలను మున్సిపల్ అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు అందుబాటులో ఉంచితే అనవసరమైన అనుమానాలకు తావుండదని వారు పేర్కొంటున్నారు.మొత్తంగా లక్దారం వార్డు కార్యాలయంలో జరిగిన సర్వసభ సమావేశం నిర్వహణ తీరుపై ఇప్పుడు చర్చ కొనసాగుతోంది. దీనిపై మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




**సర్వసభలో చైర్మన్ మామ హాజరు..! పెత్తనం ఎవరిది?**

ఇస్నాపూర్ పురపాలక సంఘంలో చర్చనీయాంశంగా మారిన వ్యవహారం....

ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లక్దారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ మామ హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాల్సిన అధికారిక సమావేశంలో చైర్మన్ కుటుంబ సభ్యుడి హాజరుపై పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు. సర్వసభ సమావేశంలో ఆయన పాత్ర ఏమిటి? ఏ హోదాతో హాజరయ్యారు? అధికారిక నిర్ణయాల్లో ఆయనకు ఏమైనా సంబంధం ఉందా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.మున్సిపల్ పాలన ప్రజల కోసం నడవాల్సిన వ్యవస్థ. కుటుంబ సభ్యుల జోక్యం ఉందనే అనుమానాలకు తావిచ్చే పరిస్థితులు ఏర్పడితే పారదర్శకతపై సందేహాలు తలెత్తడం సహజమే.అసలు ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పెత్తనం ప్రజాప్రతినిధులదా? అధికారులదా? లేక కుటుంబ సభ్యులదా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు బలంగా వ్యక్తమవుతున్నాయి.

**పారదర్శకత కోల్పోయిన మున్సిపల్ కమిషన్ వెంకట కిషన్...**

ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లక్దారం వార్డు కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి తలుపులు మూసివేసి నిర్వహించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ సమావేశం ఇలా మూసివేసిన తలుపుల మధ్య జరగడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. సమావేశం పారదర్శకతపై స్పష్టత ఇవ్వాలని మీడియా కోరగా.. కమిషనర్ వెంకట కిషన్ సమావేశం ముగిసిన వెంటనే వార్డు కార్యాలయం నుండి జవాబుదారీతనం కోల్పోయి వెళ్ళిపోయారని స్పష్టంగా అర్థమవుతుంది.

# భూమి పొందే వరకు విశ్రమించొద్దు

**మొదటి పేజీ తరువాయి...**

ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన బౌరంపేట దళితులను ఉద్దేశించి ప్రసంగించారు. బౌరంపేట్ మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వ్యవసాయం జీవనాధారంగా చేసుకొని జీవించిన దళితులకు ప్రభుత్వం ఏ పరిహారం ఇవ్వకుండానే అసైన్మెంట్ స్థలాలను వాపస్ తీసుకోవడం ధర్మం కాదని అన్నారు. దుండిగల్ లో అసైన్మెంట్ స్థలాలను ప్రభుత్వం తీసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఎకరాకు అసై నీకు 700 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వం ఇవ్వడానికి ఒప్పుకుందని అన్నారు. అలాగే బౌరంపేట్ లో సర్వే నెంబర్ 472 లో కూడా ఇదే విధానాన్ని పాటించి ప్రతి ఎకరా నుండి అసైనీదారులకు 1000 గజాల స్థలాన్ని అన్ని హక్కులతో అసైన్ మెంట్ దారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బౌరంపేట దళితులకు ప్రభుత్వం నుండి పరిహారంగా భూమి పొందే వరకు ఎవరు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు,గిరి వర్ధన్ రెడ్డి ప్రసంగించారు మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపవద్దని



న్యాయంగా అందాల్సిన నష్టపరిహారం ఇప్పించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన బౌరంపేట మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ మాట్లాడుతూ ఇంతవరకు సర్వేనెంబర్ 472లో వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొచ్చిన వారు నేడు ప్రభుత్వం వ్యవసాయం చేయకుండా ఆపడంతో ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం చేయవద్దని, దుండిగల్ అసైనీదారులకు ఏమాదిరిగా పరిహారం ఇస్తున్నారో అదే మాదిరిగా ప్రతి ఎకరాకు ఒక వెయ్యి గజాలు స్థలాన్ని దళితులకు కూడా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు నల్ల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగారెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో బౌరంపేట్ సర్వే నెంబర్ 166 కు చెందిన అసైని దారులు కూడా హాజరై తమకు కూడా ఎలాంటి పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని ఈటెల రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 166 లో మొత్తం 450 ఎకరాలు స్థలం ఉండగా అందులో పోలీస్ డిపార్ట్మెంట్ కు 50 ఎకరాలు, స్మశాన వాటికకు 10 ఎకరాలు, డంపింగ్ యార్డ్ కు 10 ఎకరాలు, డబల్ బెడ్రూమ్స్ ఇళ్లకు 10 ఎకరాలు కేటాయించినట్లు వారు ఎంపీ ఈటెల రాజేందర్ కు వివరించారు. సుమారు 140 ఎకరాలు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్న రైతుల అదుపులో భూమి ఉన్నట్లు తెలిపారు. దీంతో సర్వే నెంబర్ 166 అసైన్మెంట్ దారులకు కూడా న్యాయం జరిగే వరకూ పోరాటం చేద్దామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమానికి బౌరంపేట దళితులు వందలాదిగా హాజరయ్యారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఈ సమావేశానికి రానున్నారని ప్రచారం జరిగిన ఆయన ఈ సమావేశానికి రాలేదు. ఈ సమావేశంలో బౌరంపేట దళిత నేతలు డప్పు కృష్ణ, బాలా గారి నరసింహా, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బలగారి మల్లేష్, చింతకింది రాము లమ్మ, అగ్గి నరసింహా, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 10 :** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, పేదల ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి సమాజానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. నాటి రజాకారులు, భూస్వాముల దోపిడీ, అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ పోరాటం



తెలంగాణలో సామాజిక చైతన్యానికి బలమైన పునాది వేసిందని తెలిపారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి చాకలి ఐలమ్మ ఒక ప్రతీకగా నిలిచారని బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మహిళలు తమ హక్కుల కోసం ప్రశ్నించేలా, అణగారిన వర్గాలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించేలా ఆమె పోరాటం స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. కష్టాలు, అణచివేతలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా న్యాయం కోసం నిలబడిన ఐలమ్మ ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం కేవలం ఒక కాలానికి పరిమితం కాదని, నేటి తరంతో పాటు భావితరాలకు కూడా నిరంతరం స్ఫూర్తినిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఆమె త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ త్యాగాలను స్మరించుకుంటూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

# మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునికి పరామర్శ

## రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు తల్లి అనారోగ్యంతో మృతి చెందారన్న వార్త తెలిసి రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అనంతరం వరంగల్ లేబర్ కాలానికి చెందిన సీనియర్ నాయకులు సిలువేరు కృపాకరం మృతి చెందిన విషయం తెలుసుకుని వెంటనే ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబాలకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను అని విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు.

విష్ణు వర్ధన్ రెడ్డి వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## శబ్ద కాలుష్యానికి తావులేకుండా నిబంధనలు పాటించాలి

## ఎస్ఐ గోపాతి సతీష్



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** వినాయక నవరాత్రి ఉత్సవాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని రామన్నపేట ఎస్ఐ గోపాతి సతీష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి డీజేలు వినియోగిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేయడం, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు నిర్వహించడం చేయరాదన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపులు ఉండవని, ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు పాటించాలని ఎస్ఐ గోపాతి సతీష్ కోరారు.

# బోడుప్పల్లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్10:** బోడుప్పల్లో అర్ధరాత్రి సమయంలో ఓ హోటల్లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని హోటల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ వ్యాపించింది. అర్ధరాత్రి సమయంలో మంటలు కనిపించడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. కొంతసేపు శ్రమించి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నియంత్రించారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్లో సిబ్బంది లేదా ఇతరులు ఎవరైనా ఉన్నారా? అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. అగ్నిప్రమాదం కారణంగా హోటల్లోని సామగ్రి, ఇతర వస్తువులకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అయితే నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు, సంబంధిత అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆచార్యుల గూడెంలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**చిలుకూరు, సెప్టెంబర్10 (అక్షిత న్యూస్):** మండల పరిధిలోని ఆచార్యుల గూడెం గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద 41వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ వారి పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం ఆమె ధైర్యం తెగువ ఆత్మగౌరవం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం అని వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలక వర్గం,గ్రామ పెద్దలు, యువకులు మహిళలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## చేనేత సహకార సంఘం చైర్మన్ పెండెం వేణుకు ఘన సన్మానం

### మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ఉద్యమ నాయకులు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట పట్టణ చేనేత సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పెండెం వేణును ఉద్యమ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కార్మికులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు బందెల రాములు, మాజీ ఉపసర్పంచ్, ఉద్యమ నాయకులు గంగాపురం యాదయ్య, బొడ్డు సైదులు, బొడ్డు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన మేయర్ కోలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి, తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక, వీరనారి చాకలి ఐలమ్మ అని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కరీంనగర్లోని ఆమె విగ్రహానికి మేయర్ కోలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సామాజిక అసమానతలు, దోపిడీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ, ఆత్మవిశ్వాసం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ కేవలం ఒక వ్యక్తి కాదు.. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని మేయర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించడమే నిజమైన నివాళి అని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పాత్ర ఎంతో కీలకమైనదని, ఆమె ధైర్యసాహసాలు, త్యాగాలు తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని మేయర్ కోలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, ఎన్నం ప్రకాష్, గాజ శివరాం, దేవసాని సత్యనారాయణ, మునిగంటి కుమార్, పొన్నాల రాము, ఉప్పరపల్లి శ్రీను, గుండారపు సంపత్, అవునూరి భరత్, వెంకట సాయి, న్యాత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూలి రేట్లు పెంచాలని కాటన్ కార్మికుల సమ్మె

**సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన సీఐటీయూ హెచ్చరిక**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాటన్ చీరల కార్మికుల సమ్మె కొనసాగుతోంది. కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేనేత, జౌళి శాఖ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ కూలి రేట్లను వెంటనే పెంచాలని వారు డిమాండ్ చేశారు. కూలి రేట్ల పెంపుపై యాజమాన్యాలు స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందని కార్మికులు తెలిపారు. కాటన్ చీరల తయారీపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 300 కుటుంబాలు కార్మికులకు ప్రస్తుత కూలి రేట్లు సరిపోవడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీ

ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కాటన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి కూలి రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. అధికారులు, యాజమాన్యాలు వెంటనే స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

# పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

**ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్**



**జగిత్యాల అక్షితబ్యూరో:** తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం జిల్లా కలెక్టరేట్ లో గురువారం జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పాల్గొని, వీరనారి చాకలి ఐలమ్మచిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిందన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలను స్మరిస్తూ, ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. వీరనారి చాకలి ఐలమ్మపేరిట మహిళా విశ్వవిద్యాలయం, ఏప్రిల్ 2022లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని కోఠి మహిళా కళాశాలను తెలంగాణ తొలి మహిళా విశ్వవిద్యాలయంగా ప్రకటించింది. ఆ తర్వాత 2024లో అది వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా అవతరించిందని వివరించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళలు స్ఫూర్తి పొందాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాలతో ఘనంగా నివాళులర్పించారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**భక్తి, సంస్కృతి ఆధ్యాత్మికతకు ప్రతీక**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** శ్రీ విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించే దేవుడని, జ్ఞానవిజయం,శుభారంభాలకు అధిదేవుడని వివిధ సమయాల్లో వివిధ రకాల ద్రవ్యాలతో ఆరాధించబడతాడని, ముఖ్యంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించబడుతాయని పాఠశాల నిర్వాహకులు డాక్టర్ వి.వనజా నరేందర్ రెడ్డి , కరీంనగర్ లోని అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వినాయక చవితి పురస్కరించుకొని ముందస్తు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి గణనాథునికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి అట్టహాసంగా శోభయమానంగా ప్రారంభించి మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ప్రతిష్ఠాపన ఉత్సవాల ప్రారంభంలో మట్టి గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించి, ప్రాణప్రతిష్ఠ, సంకల్పం, అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలు నిర్వహిస్తారని వారు చెప్పారు. వివిధ పూజా కార్యక్రమాలు నవరాత్రుల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలను నిర్వహించడం ద్వారా ఉత్సవాలకు ఆధ్యాత్మిక శోభను తీసుకురావడం జరుగుతుందని వారు తెలిపారు,

ప్రధానంగా గణపతి హోమం, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం పంచామృత అభిషేకం, పుష్పార్చన,కుంకుమార్చన, ప్రసాద వితరణ, అన్నదానం చేయడం చాలా పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు,

ప్రతిరోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. గణేష్ నవరాత్రుల్లో పిల్లలు, యువత మరియు మహిళల ప్రతిభను ప్రోత్సహించే వేదికగా కూడా వాడుకుంటారని చెప్పారు సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, భక్తి గీతాలు, చిన్న నాటికలు, హరికథలు, కీర్తనలు, సంగీత కార్యక్రమాలు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. పలువురు చిన్నారులు గణనాథుని వేషధారణలో విచ్చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## ఆత్మగౌరవానికి,హక్కుల సాధనకు, దిక్సూచి చాకలి ఐలమ్మ

**మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**



**వరంగల్, అక్షిత బ్యూరో:** దొరలకు గడిలకు ఎదురొడ్డి పోరాడి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలంగాణ విముక్తి పోరాటానికి దిక్సూచి అయ్యిందని మాజీమంత్రి ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య అన్నారు. వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం న్యూ శాయంపేట జంక్షన్లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ మంత్రి ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం మాత్రమే పోరాడిన మహిళ కాదని, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా చేయూతనందిస్తోందని తెలిపారు. పోరాట యోధుల త్యాగాలు, వారి పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చాకలి ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలివారని,ఆమె స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వివిధ శాఖల అధికారులు రజక సంఘం నాయకులు సాంబరాజు అంకయ్య, బసవరాజ్ కుమార్,డాక్టర్ పాలడుగుల సురేందర్, కొండమీది రాజన్ బాబు, బసవరాజు శ్రీమన్ కుమార్, చిట్యాల రామచందర్, డాక్టర్ మధు చందర్,రావుల సుదర్శన్ రాముల బాబు, నూతన కంటి ఆనందం, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను 'గ్రీన్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**మేయర్ కోలగాని శ్రీనివాస్**



కరీంనగర్ అక్షిత బ్యూరో: పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, కరీంనగర్‌ను సుందర, స్వచ్ఛ, హరిత నగరంగా (గ్రీన్ సిటీ) తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ అన్నారు గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు మేయర్ శ్రీకారం చుట్టారు. స్థానిక కార్పొరేటర్ సమీనా పర్వీన్, జమ్ము తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా 34వ డివిజన్ ప్రజలు మేయర్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం మేయర్ కొబ్బరికాయ కొట్టి, అభివృద్ధి



పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఈ ప్రాంతం నగరంలో భాగమైన నేపథ్యంలో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. 34వ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు.

అదేవిధంగా యూఐడిఎఫ్ నిధుల నుంచి మరో రూ.50 లక్షలు వెచ్చించి డివిజన్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రజల ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

"నగరంలోని ప్రతి డివిజన్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కరీంనగర్‌ను స్వచ్ఛ, సుందర, హరిత నగరంగా తీర్చిదిద్దే దిశగా నిరంతరం కృషి చేస్తాం" అని మేయర్ కోలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ నందకుమార్, మున్సిపల్ అధికారులు, స్థానిక డివిజన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూత్పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
# ఘటనాస్థలిని పరిశీలించిన జిల్లా ఎస్పీ

మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ : భూత్పూర్ సమీపంలోని కేబీఎన్ ఫంక్షన్ హాల్ వద్ద జాతీయ రహదారి-44పై గురువారం తెల్లవారుజామున ఖా 77 డీసీ 7458 నంబర్ గల మేకల లోడ్ తో వెళ్తున్న వాహనం అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఢీకొన్న ప్రభావంతో సూచిక బోర్డు రహదారికి అడ్డంగా పడిపోగా, వాహనం ఇంధన ట్యాంక్ దెబ్బతినడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

వాహనం క్యాబిన్‌లో డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు ఉండగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో స్థానిక భూత్పూర్ పోలీసులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





మరో ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. మేకలతో ఉన్న వాహనం లోపల మరో వ్యక్తి ఉండగా, మేకలన్నీ ఒక్కసారిగా అతనిపై పడిపోవడంతో బయటకు రాలేక మంటల్లో చిక్కుకుని మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ప్రమాదంలో పెద్ద సంఖ్యలో మేకలు మృతి చెందాయి.

సమాచారం అందుకున్న వెంటనే భూత్పూర్ పోలీసులు, స్థానిక పోలీసులు మరియు అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రహదారికి అడ్డంగా పడిన సూచిక బోర్డును పోలీసులు వెంటనే తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి జాతీయ రహదారి-44పై వాహనాల రాకపోకలను త్వరితగతిన పునరుద్ధరించారు.

ప్రమాద సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డి.జానకి ఘటనాస్థలిని పరిశీలించి, ప్రమాద పరిస్థితులను, సహాయక చర్యలను సమీక్షించారు. బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఘటనా స్థలంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ఉద్దీన్, భోత్పూరు సబ్ ఇన్స్పెక్టర్ నాగన్న, మూసాపేట సబ్ ఇన్స్పెక్టర్ వేణు, అగ్నిమాపక సిబ్బంది మరియు స్థానిక పోలీసులు ఉన్నారు.

## కేసీఆర్ దళితులకు క్షమాపణ చెప్పేవరకు ఉద్యమిస్తాం



మేడ్చల్, అక్షిత ప్రతినిధి: దళితులను అవమానించేలా చూసిన బీఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శామీర్ పేట్ మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో దళిత స్పీకర్ అయిన గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే దప్పుల తో దళితులు కేసీఆర్ ఫామ్ హౌస్ ను ముట్టడించామన్నారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి లను బర్తరఫ్ చేయాలన్నారు. దళితులు మా జాగలోకి వస్తారా అని రోడ్లను శుద్ధి చేయడం సిగ్గుచేటన్నారు. దళితులను చిన్న చూపు చూస్తున్న బీఆర్ఎస్ నాయకులకు సహకరిస్తున్న దళిత బీఆర్ఎస్ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. దళితులకు ఎప్పుడూ కూడా బీఆర్ఎస్ నాయకులు గౌరవం ఇవ్వలేదని, ఆ బీఆర్ఎస్ నాయకులు సస్తే బొంద పెట్టేది, వారి పాడె ముందు దప్పు కొట్టేది దళితులే అని గుర్తు పెట్టుకోవాలని గుర్తు చేశారు. దొరల పాలనకే కావాలని కోరుకునే కేసీఆర్ దళితులకు క్షమాపణ చెప్పేవరకు దళితులను ఏకంచేసి ఉద్యమిస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఉదండపురం సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు వేముల మహేష్, బాల్ రెడ్డి, నవీన్ రెడ్డి, హరిబాబు, రాజు, నర్సింగ్ రావు, శ్రీకాంత్, బీపీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మిల్లర్లందరినీ డిఫాల్టర్లుగా చిత్రీకరించడం సరికాదు



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: రైస్ మిల్లింగ్ పరిశ్రమ సమస్యలను పట్టించుకోకుండా మిల్లర్లందరినీ డిఫాల్టర్లుగా చిత్రీకరించడం సరికాదని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల తిరుపతి, గౌరవ అధ్యక్షుడు కోరే రవి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాలో వారు మాట్లాడుతూ.. గత పదేళ్లలో కేటాయించిన ధాన్యంలో డిఫాల్ట్ అయిన పరిమాణం రెండు శాతానికి కూడా తక్కువేనన్నారు. మిల్లుల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే వేలం వేయాలని, అదనంగా కేటాయించిన 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉడికించిన బియ్యంగా మార్చేందుకు అనుమతించాలని కోరారు. మిల్లింగ్‌లో వాస్తవిక నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలని, సీఫ్‌టీఆర్ఐ నివేదికల ఆధారంగా ఓటీఆర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.పంట సీజన్‌కు అనుగుణంగా డైనమిక్ క్రాప్ పాలసీ అమలు చేయాలని, 2014--2025 వరకు పెండింగ్‌లో ఉన్న పంటలకు వడ్డీ, జరిమానా లేకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యానం సంతోష్, రవీందర్‌రెడ్డి, రాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ తెగువను స్ఫూర్తిగా తీసుకోవాలి

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్**



సత్తుపల్లి, అక్షిత న్యూస్: వీర తెలంగాణ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాలను సాధిస్తామని ఆటో డ్రైవర్లు ప్రతిజ్ఞచేశారు.గురువారం ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని మర్లపాడులో సీఐటీయూ ఆధ్వర్యంలోఐలమ్మచిత్రపటానికి కార్మికులు పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్మికుల హక్కుల సాధన కోసం ఐలమ్మ చూపించిన తెగువను స్ఫూర్తిగా తీసుకొని పాలకులపై పోరు చేయాలని ఆటో వర్కర్స్ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దంకరశ్రీను, సాధుసుధాకర్, రియాజ్, బొందలయాకోబు,కంచర్లపుల్లయ్య, షేక్ బాజీ పాల్గొన్నారు.

## సిరిసిల్ల ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**అన్యాయాన్ని ఎదిరించి పోరాడిన వీరవనిత ఐలమ్మ స్ఫూర్తిదాయకం: మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సిరిసిల్ల పట్టణంలోని చాకలి ఐలమ్మ చౌరస్తాలో సిరిసిల్ల రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరవనిత చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గంలో జన్మించిన చాకలి (చిట్యాల) ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రజాకార్ల దోపిడీ, దౌర్జన్యాలకు ఎదురొడ్డి హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. అన్యాయాన్ని ఎదిరించి, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం చాకలి ఐలమ్మ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల రజక సంఘం అధ్యక్షులు దండు శ్రీనివాస్, నెహ్రూ నగర్ రజక సంఘం అధ్యక్షుడు మారుపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాసర్ల మహేందర్, సీహెచ్. బాలరాజు, దండు ఎల్లయ్య, వేములవాడ శ్రీనివాస్‌తో పాటు పలువురు రజక కుల బాంధవులు పాల్గొని చాకలి (చిట్యాల) ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.

## కలెక్టరేట్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం

**అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**





**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఐలమ్మ పోరాటాలను గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పాత్రను వివరించారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించిందని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనకు పాటుపడిన గొప్ప మహిళ అని వివరించారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను నేటి తరం ప్రజలు తెలుసుకోవాలన్నారు.

ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగంగా పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత**

**నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన**



**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల జిల్లా, పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీసర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను



అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.

నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రైతులు, గ్రామస్థులు అడిగిన సందేహాలకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, మండల సర్వేయర్ , రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్ల ప్రధానలక్ష్యం

**జిల్లా ఎస్పీ**

**ప్రతి ఒక్క డ్రైవర్ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవర్చుకోవాలి**

**అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి**

**జగిత్యాల అక్షితబ్యూరో:** ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై జగిత్యాల ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఆర్టీసీ డ్రైవర్ల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్, డ్రైవర్లకు పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని, వారి సురక్షిత ప్రయాణం డ్రైవర్ల బాధ్యతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని అన్నారు. ప్రతి డ్రైవర్ రహదారి భద్రతను తన వ్యక్తిగత బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని



సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకరంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి వాటికి డ్రైవర్లు దూరంగా ఉండాలని సూచించారు. ప్రయాణికులను సమయానికి గమ్యస్థానాలకు చేర్చాలనే ఉద్దేశంతో వేగంగా వాహనం నడపడం కంటే, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మలుపులు, కూడళ్లు, వంతెనలు, రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించాలని సూచించారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ, తగినంత దూరం పాటిస్తూ ఓవర్‌టేకింగ్ చేయాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల డ్రైవర్ దృష్టి రహదారి నుంచి మరలే అవకాశం ఉందని, ఒక్క క్షణం నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదానికి కారణమవుతుందని కావున డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకపోవడం ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా పాటించాల్సిన నియమమని స్పష్టం చేశారు. ప్రతి డ్రైవర్ రహదారిపై ఇతర వాహనదారులు కూడా తప్పులు చేసే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతిని పాటించాలని సూచించారు. ఇతర వాహనదారుల కదలికలను ముందుగానే అంచనా వేసి, అవసరమైన సమయంలో వేగాన్ని తగ్గించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణకు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌కు ఆదర్శంగా నిలవాలని అన్నారు. డ్రైవర్ తీసుకునే ప్రతి నిర్ణయం ప్రయాణికుల జీవితాలపై ప్రభావం చూపుతుందని, అందువల్ల తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు తావు లేకుండా, సురక్షితంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన ముగ్గురు ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఇతర డ్రైవర్లు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రమాదరహిత డ్రైవింగ్‌కు కట్టుబడి విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డీటీఓ మహమ్మద్ సందాని, ఆర్టీసీ ఆర్.ఎం రాజు, డిప్యూటీ ఆర్.ఎం భూపతి రెడ్డి, టౌన్ సిఐ కరుణాకర్, డిపో మేనేజర్లు రమేష్, మనోహర్, హరి, ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ తో పాటు ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం

# సక్సెస్ చేయాలి



### బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరీ సత్యం

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల నిర్విరామ సేవా ప్రయాణాన్ని, దేశాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని , వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ఈనెల 17 నుండి అక్టోబర్ 17 వరకు చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' ప్రోగ్రాం ను సక్సెస్ చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చెపూరీ సత్యం పిలుపునిచ్చారు. గురువారం తిమ్మాపూర్ బిజెపి 'సేవా సంకల్ప అభియాన్' సన్నాహక సమావేశం అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్యం సేవా సంకల్పయాన్ ప్రోగ్రాం కు సంబంధించిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితాన్ని, ఆయన అంకితభావాన్ని కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. దేశం కోసం, ప్రజల సంక్షేమం కోసం సేవా సంకల్పంతో నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ సూచించిన, నిర్దేశించిన ప్రతీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

22ఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి.. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి..

తిమ్మాపూర్ మండలం ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించిన బిజెపి నేతలు చేపూరి సత్యం, చింతం శ్రీనివాస్ వినతి తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 22ఏ (నిషేధిత భూములు) జాబితా అక్రమాలు, అవకతవకలపై, వేలాది మంది రైతులు, భూ యజమానుల ఆస్తి హక్కులను కాలరాస్తున్న ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకొని, ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరీ సత్యం, మండల అధ్యక్షులు చింతం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రోజున ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి కార్యదర్శి చేపూరి సత్యం , చింతం శ్రీనివాస్ లు మండల బిజెపి శ్రేణులతో కలిసి ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన భారీ అవకతవకలను కేవలం పరిపాలనా తప్పిదంగా కాకుండా, ఒక వ్యవస్థీకృత కుట్రగా పరిగణించి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

వేలాది మంది భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ భారీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధరణి/భూభారతి పోర్టల్స్‌లో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు జరిగిన మార్పులు, చేర్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. మండల వారీగా 22ఏ భూముల వివరాలను, గ్రామం, సర్వే నంబర్ల వారీగా బహిర్గతం చేసి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు, పట్టా భూములను వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయడానికి ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చిన అధికారులు, మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా చేపూరి సత్యనారాయణ, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్,కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మోహన్,గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఓ బి సి మోర్చ జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్ , దుర్శేటి రమేష్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి,గాండ్ల రాము,బుర్ర శ్రీనివాస్ గౌడ్, జాడి రాజు,బండి స్వామి,బూరుగు శ్రీనివాస్ రెడ్డి,దళిత మోర్చ మండల అధ్యక్షుడు ఎల్కపల్లి స్వామి,కుమార్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలకు స్ఫూర్తి దాయకం వీరనారి చాకలి ఐలమ్మ

### పాల్గొన్న,కూడా చైర్మెన్ గుండు సుధారాణి,కలెక్టర్లు



**వరంగల్, అక్షిత బ్యూరో:** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం న్యూ శాయంపేట జంక్షన్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి,వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం మాత్రమే పోరాడిన మహిళ కాదని, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆమె చూపిన ధైర్యం, తెగువ, ఆత్మ విశ్వాసాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, వరంగల్ హనుమకొండ, జిల్లాల అదనపు కలెక్టర్లు వై.వి. గణేష్, ఎల్. కిషోర్ కుమార్,ఎన్. రవి, వరంగల్ ఆర్డీవో సుమ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, లక్ష్మణ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, డాక్టర్ మధుచందర్, మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనంద్, మున్సిపల్, కుడా, ఇతర శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్ జి. మమత,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని వారు స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రజక సంఘం నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

### వినాయక మండపం నిర్వాహకులతో శాంతి సమావేశం...

### డీఎస్పీ పట్టోళ్ల మధుసూదన్ రెడ్డి

### చౌటుప్పల్ సిఐ జి మన్మధ కుమార్




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని డి.ఎస్.పి పటోళ్ల మధుసూదన్ రెడ్డి సూచించారు. గురువారం చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ సమన్వయంతో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, యువకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో వినాయక ఉత్సవ శాంతి కమిటీ సమావేశంను చౌటుప్పల్ వలిగొండ రోడ్డులోని ఎస్ఎం రెడ్డి గార్డెన్స్ లో నిర్వహించారు.

ఈ సమావేశంలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత తదితర అంశాలపై చర్చించారు. వినాయక ఉత్సవాల ను ప్రతి ఒక్కరూ సమన్వయంతో, భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డి.ఎస్.పి సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని, అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్.డీ.ఓ. వి శేఖర్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ , మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ , ఎస్సై యాదగిరి, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ సర్పంచులు, చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి కమిటీ సమావేశం

**కే రవీందర్ రెడ్డి**



**హాలియా, అక్షిత న్యూస్:** నాగార్జునసాగర్ నియోజకవర్గ హాలియా మున్సిపాలిటీ లో గణేష్ చతుర్థి సందర్భంగా మండల స్థాయి శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి పీస్ కమిటీ సమావేశం మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గణేష్ చతుర్థి ఉత్సవాలను శాంతియుతంగా, సోదర భావంతో నిర్వహించాలని ప్రజలందరూ పరస్పర సహకారంతో పండుగను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి వాంఛన సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని గణేష్ విగ్రహాల ఏర్పాటు చేస్తే చేసే స్థలంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలి మరియు మున్సిపల్ శాఖ రెవిన్యూ శాఖ మండల పరిషత్ శాఖ మరియు పోలీస్ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని సిబ్బందిని మరియు ఎలాంటి ఆటంకంలో లేకుండా గణేష్ ఉత్సవాలు ఏర్పాటు చేసుకోవాలని చైర్మన్ సూచించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్, ఎమ్మార్వో, కౌన్సిలర్లు సలహాదారులు అనుముల మండల సర్పంచులు కమిటీ అధ్యక్షులు మైనార్టీ పెద్దలు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ విద్యుత్ శాఖ వైద్య ఆరోగ్యశాఖ మున్సిపల్ శాఖ వారు పాత్రికేయ మిత్రులు పాల్గొనడం జరిగింది

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై సోషల్ మీడియాలో చనిపోయినట్టుగా పోస్టులు పెట్టిన వారిపై మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**సోషల్ మీడియాలో ప్రచారం చేసే వ్యక్తులను కఠినంగా శిక్షించాలి. సిహెచ్ యాదయ్య**



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో షాద్ నగర్ ఎమ్మెల్యే ఒక రజక (చాకలి) కుటుంబంలో నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో దొరల పాలనపై మాట్లాడుతుంటే.. ఓర్వలేక సోషల్ మీడియాలలో చనిపోయిన వీడియోల తో ప్రచారం చేయడం పట్ల కొంతమంది వ్యక్తులపై.. మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య ఫిర్యాదు చేశారు. ఒక వైపు బిఆర్ఎస్ నాయకులు దళిత స్పీకర్ పై అవమానకరమైన వాక్యాలు చేస్తూ.. మాట్లాడడం దళితులు దప్పు చప్పుడులతో.. ఎర్రవల్లి లో ఉండే కేసీఆర్ ఫామ్ హౌస్ కి వెళ్లడంతో.. చుట్టూ పరిసరాలు మొత్తం దళితులు వచ్చారని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వీటిపై బిఆర్ఎస్ స్పందించకపోవడం పట్ల మండిపడ్డ మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, మహేశ్వరం సిఐ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**సీతాయిగూడెం రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్**



**భద్రాద్రి కొత్తగూడెం , అక్షిత బ్యూరో:** భూ రీ సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులను పక్కాగా నమోదు చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం చంద్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలో 1,823 ఎకరాలకు రీ సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు భూముల వివరాల పరిశీలన జరుగుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. గ్రామంలో సుమారు 200 నివాసాలు ఉన్నాయని, కొందరికి భూములు ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌బుక్‌లు లేకపోవడం, రికార్డులు క్షేత్రస్థాయి వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం వంటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరిజనులతో నేరుగా మాట్లాడి రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పాత భూ రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితిని గుర్తించడం ద్వారా భూ హక్కులకు స్పష్టత లభిస్తుందని గిరిజనులు తెలిపారు. అనంతరం కలెక్టర్ పాత భూ రికార్డులు, 1920ల నాటి మ్యాప్‌లను పరిశీలించారు. అప్పటి భూముల హద్దులు, చెట్లు, కుంటలు, చెరువులు, తోటలు తదితర వివరాలను నమోదు చేసిన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన హద్దు రాళ్లు అనేక ప్రాంతాల్లో కనిపించడం లేదని అధికారులు వివరించగా, రీ-సర్వే అనంతరం భవిష్యత్‌లో సులభంగా గుర్తించే విధంగా శాశ్వత హద్దు గుర్తులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు రికార్డుల్లో తప్పిపోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రీ సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ తో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, సర్వే అధికారులు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించాలి

**సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలిబీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** తెలంగాణ విమోచన చరిత్రను పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్కు "తెలంగాణ సత్తా సంకల్పాలు" అమలు చేయాలని కోరుతూ విజ్ఞాపన పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. తెలంగాణ విమోచన కోసం ఎందరో మహనీయులు, అమరవీరులు చేసిన త్యాగాలు, పోరాటాలను నేటి తరానికి, రాబోయే భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను విస్మరించకూడదని, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని అన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ఘనంగా నిర్వహించడంతో పాటు, విమోచన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే తెలంగాణ విమోచన చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ప్రదేశాలను గుర్తించి వాటిని చారిత్రక స్మారక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, విమోచన ఉద్యమంలో పాల్గొన్న వీరుల చరిత్రను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. "చరిత్రను మరచిపోయిన సమాజం భవిష్యత్తును నిర్మించుకోలేదు. తెలంగాణ విమోచన చరిత్ర మన ఆత్మగౌరవానికి ప్రతీక. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత" అని దుమాల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాన రాంప్రసాద్, మెరుగు శ్రీనివాస్, సిద్ధి దేవరాజు, కంబోజు శ్రీధర్, పెల్లికొండ నరసయ్య, బందారి శ్యామ్, దూడం సురేష్, చొప్పదండి శ్రీనివాస్, అంకారపు రాజు, అభి, కొట్టె భాను, ఎదుల శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## షేక్ లతీఫ్ కుటుంబానికి హార్ధిక సాయం అందించిన బీ జే పి మండల కమిటీ

**లతీఫ్ కుటుంబానికి బీ జే పి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది.**

**మండల పార్టీ అధ్యక్షులు బండారు వీరబాబు**



**నడిగూడెం, అక్షిత న్యూస్:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీ జే పి మాజీ మండల ఉపాధ్యక్షుడి కుటుంబానికి 10000/ రూపాయలు ఆర్థిక సహాయం అందించిన బీ జే పి మండల కమిటీ మాజీ బీ జే పి ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని నడిగూడెం బీ జే పి మండల కమిటీ పరామర్శించి,కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తూ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. ఈ సందర్భంగా నడిగూడెం మండల బిజెపి అధ్యక్షులు బండారు వీరబాబు యాదవ్ మాట్లాడుతూ,పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తల, నాయకుల కుటుంబాలకు బిజెపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మృతుడి కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రౌత్ కళ్యాణ్, కేశగాణి పాపయ్య, మండల ఉపాధ్యక్షులు బీరవెల్లి గోపాల్ రెడ్డి,మామిడి రామకృష్ణ, ముప్పా నరసింహారావు, నడిగూడెం మండల మాజీ అధ్యక్షులు దున్న సతీష్, మండల యువమోర్చా అధ్యక్షులు చెన్నకేశ గోపాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిలకా బాలకృష్ణ, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి బండారు శోభారాణి, జిల్లా ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యులు తాళ్లూరి రామకృష్ణ, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు రౌత్ వీరేంద్ర వర్మ, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు దుస్సా గోపి, నాయకులు రెడ్డిపల్లి రాముడు, గుండోజు ఉపేందర్, వట్టికూటి రమేష్, గంధం గురుస్వామి తదితరులు పాల్గొని మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.